## పదోతరగతి ప్రతిభా పరీక్ష



పరీక్షా పత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, ఎస్ఎఫ్ఐ బాధ్యులు

కామారెడ్డి, ఫిబ్రవరి 18: జిల్లాకేంద్రంలోని సాందీపని జూనియర్ కళాశాలలో భారతీ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పదోతరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో ఎల్లయ్య హాజరై మాట్లాడారు. పరీక్షలపై అవగాహన కల్పించడంతోపాటు భయాన్ని దూరం చేసేందుకు భారతీయ విద్యార్థి ఫెడరేషన్ బాధ్యులు చేసిన ప్రయత్నాన్ని అభినందించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై అనిల్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, సాందీపని కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, కార్యదర్శి అజయ్, సంతోష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిజాంసాగర్, ఫిబ్రవరి18: మహ్మద్‌నగర్ మండలం నర్వ గ్రామంలోని పలు కాలనీల్లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు జయప్రదీప్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు రూ.ఐదు లక్షలను మంజూరు చేయడంతో వాటితో సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లోక్యానాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకాశ్, నాయకులు గంగి రమేశ్, గొట్టం నర్సింహులు, భూమాగౌడ్, శివ, మురళి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మొరం రోడ్డు పరిశీలన



వెంకంపల్లి బ్రిడ్జి వద్ద మొరం రోడ్డును పరిశీలిస్తున్న నాగిరెడ్డిపేట్ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 18: వెంకంపల్లి బ్రిడ్జికి అవతలివైపున ప్రజలు నిర్మించుకున్న తాత్కాలిక మొరం రోడ్డు పనులను నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లోని నాగిరెడ్డిపేట, పాపన్నపేట మండలాలను కలుపుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజీరా నదిపైన వంతెనతోపాటు ఇరువైపులా రహదారికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. వెంకంపల్లి గ్రామం వద్ద రూ.38 కోట్లతో వంతెన నిర్మించి తాండూర్ గ్రామం వరకు రహదారిని నిర్మించారన్నారు. వంతెనకు మరోవైపు మెదక్ జిల్లా పాపన్నపేట మండలం వరకు రోడ్డు లేకపోడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నాయకులు పట్టించుకోకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు తాత్కాలికంగా మొరం రోడ్డును ఏర్పాటుచేసుకున్నారని అన్నారు. ఎల్లారెడ్డి, మెదక్ ఎమ్మెల్యేలు తక్షణమే స్పందించి త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. ఆయనతోపాటు నాయకుడు చిలుకూరు సురేందర్‌రెడ్డి ఉన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



నిజాంసాగర్, ఫిబ్రవరి 18: నిజాంసాగర్ మాజీ వైస్ ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు గురించి మాట్లాడారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

## ఆలయాల్లో భక్తుల సందడి



స్వామివారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

మాచారెడ్డి, ఫిబ్రవరి 18: జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. మాచారెడ్డి మండలం చుక్కాపూర్ లక్ష్మీన్న సింహస్వామిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఒడిబియ్యం, పట్టెనామాలు, కోరమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



బిచ్కుందలోని 14వ వార్డులో ఇండ్ల మధ్య రోడ్డుపై నిలిచిన మురుగునీరు

# పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- ఫలితం లేని ప్రత్యేక వారోత్సవాలు
- నామమాత్రంగా నిర్వహణ
- కాలనీల్లో ఎక్కడి చెత్త అక్కడే..
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ప్రజలు



మురికి కాలువలో పేరుకుపోయిన చెత్త

బిచ్కుంద, ఫిబ్రవరి 18: గ్రామాలను పరిశుభ్రంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలను నిర్వహించింది. పల్లెలు, పట్టణాల్లో ఎక్కడ కూడా చెత్తాచెదారం లేకుండా, మురికి కాలువలు శుభ్రంగా ఉండేలా తీర్చిదిద్దడం వారోత్సవాల లక్ష్యం. కానీ అధికారుల పర్యవేక్షణా లోపం, గ్రామ స్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. పారిశుద్ధ్య వారోత్సవాలు ముగిసినా పల్లెల్లో ఇంకా చెత్తాచెదారం దర్శనమిస్తున్నది. మురికి కాలువలు కంపు కొడుతున్నాయి.

మండల కేంద్రమైన బిచ్కుందలో పారిశుద్ధ్య వారోత్సవాలను నామమాత్రంగా నిర్వహించారు. 13, 14వ వార్డుల్లో మురికి కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. పైపైన మురికిని తొలగించడంతో ప్రస్తుతం కాలువల్లో నీరు సరిగా పారడం లేదు. మురికి నీరంతా ఒకేచోట ఆగడంతో దోమల బెడద ఎక్కువై రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. బస్టాండ్ ఆవరణలోని దుకాణాదారులు, హోటళ్ల సముదాయాల వారు చెత్తను పారేయడంతో దుర్గంధం వెదజల్లుతున్నది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పరిస్థితి ఇలాగే ఉన్నదని మండలవాసులు వాపోతున్నారు. ప్రస్తుతం పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండడంతో పరిస్థితి మరీ దారుణంగా మారిందని అంటున్నారు. ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామాలను అప్పగించడంతో వారు శాఖా పరమైన పనులను చూస్తూ.. పంచాయతీల్లో సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేయడానికి ప్రజలు కూడా భయపడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న సంక్షేమ పథకాలు తమకు అందకుండా పోతాయని వారు జంకుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## 'అమ్ముల పొది' పుస్తకావిష్కరణ



పుసకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

కామారెడ్డి, ఫిబ్రవరి 18: జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత అల్లి మోహన్‌రాజ్ రచించిన అమ్ముల పొది కవితా సంపుటిని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. నిజాలను నిర్భయంగా ప్రకటించే సత్తా కవులు, రచయితలకే ఉంటుందన్నారు. సమాజాన్ని నిరంతరం చైతన్యం చేస్తూ అనేక సామాజిక రుగ్మతలకు పరిష్కారం చూపే ఆలోచనను కవి చేస్తాడని, అందుకే రచయితలు నిరంతరం ప్రజల పక్షాన నిలబడతారని అన్నారు. అలాంటి రచనలే భావి తరాలను ప్రభావితం చేస్తాయని, శాశ్వతంగా నిలబడతాయని తెలిపారు. కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, కవులు గంగాప్రసాద్, పితాంబర్, నాగభూషణం, రామచంద్రం, సత్యనారాయణ, సిరిగాద శంకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## భిక్కనూరులో నేడు విద్యుత్ అంతరాయం

భిక్కనూరు, ఫిబ్రవరి18: మండల కేంద్రంలో నేడు (సోమవారం) విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న కారణంగా కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంకీర్త్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కరెంటు సరఫరాను నిలిపివేస్తామని, భిక్కనూరు పట్టణ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1995-96 బ్యాచ్ విద్యార్థులు, వారి గురువులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 18: మహ్మద్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం సందడిగా కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటాపాటలతో సరదాగా గడిపారు. చిన్నప్పటి చిలిపి పనులను నెమరేసుకుంటూ కుటుంబీకులతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజశేఖర్, కృష్ణ, రాజాగౌడ్, సాయిలు, రఘువీర్, శ్రీధర్ రెడ్డి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బీబీపేట్, ఫిబ్రవరి 18 : మండలంలోని జనగామ శివారులో ఆదివారం ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. మృతదేహాన్ని చూసిన స్థానికులు తమకు సమాచారం అందించడంతో వెళ్లి పరిశీలించామని చెప్పారు. మృతదేహం కుళ్లిన స్థితిలో గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉన్నదని, అతనివద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని వివరించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించామని తెలిపారు. మృతుడికి సంబంధించినవారు ఉంటే బీబీపేట ఎస్సై సెల్ నంబర్ 8712686157 కు ఫోన్ చేయాలని సూచించారు.

## శివాజీ జయంతికి ఏర్పాట్లు



డోంగ్లీలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ముస్తాబుచేస్తున్న యువకుడు

డోంగ్లీ, ఫిబ్రవరి 18: మండలకేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని సోమవారం నిర్వహించేందుకు యువకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని ఆదివారం అందంగా అలంకరించారు. వీధుల్లో కాషాయపు పతాకాలు కట్టారు. విగ్రహ సమీపంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉండడంతో వాటిని విద్యుత్ సిబ్బంది, గ్రామ యువకులు కలిసి సరిచేశారు.

### నేడు శోభాయాత్ర..

దోమకొండ, ఫిబ్రవరి 18 : ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శివాజీ సేవా సమితి సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికులతోపాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, యూత్ సభ్యులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

## నంబర్ ప్లేట్ లేని 11 టూవీలర్స్ సీజ్

దోమకొండ, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలో ఆదివారం ఎస్సై గణేశ్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని పలు వాహనాలకు జరిమానా విధించారు. నంబర్ ప్లేట్ సరిగాలేని 11 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

నిజాంసాగర్, ఫిబ్రవరి 18: మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లిలో ఒకటి, బ్రాహ్మణపల్లిలో ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు. ఆదివారం ఉదయం గమనించిన రైతులు విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు తెలియజేశారు. ఏఈ లక్ష్మణ్ ఆదేశాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, రాగి వైరు చోరీకి గురైందని, విలువ రూ.లక్ష వరకు ఉంటుందని రైతులు తెలిపారు.

## రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

భిక్కనూరు, ఫిబ్రవరి 18: పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధిపొందే రైతులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఈవో వినోద్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటలో సూచించారు. ఇందుకోసం మీసేవ లేదా వ్యవసాయ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. కేవైసీ చేయించుకోని రైతులకు సీఎం కిసాన్ పథకం కింద ఆర్థికసాయం జమకాదని తెలిపారు.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్, ఫిబ్రవరి 18 : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎసై ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. డెబిట్, క్రెడిట్ కార్డుల అప్‌డేట్, బహుమతులు వచ్చాయని సైబర్ మోసగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, లోన్లు మంజూరయ్యాయని, వివిధ రకాల యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవాలని నమ్మించి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులను ఖాళీ చేస్తారని హెచ్చరించారు.

## భోగేశ్వరాలయంలో నేడు మహా పడిపూజ

గాంధారి, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని భోగేశ్వరాలయంలో సోమవారం శివ మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాలధారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివ లింగానికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అన్నదానం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## ఎల్లారెడ్డిలో నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 18: ఎల్లారెడ్డి పట్టణంలో సోమవారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం వరకు సామాజిక తనిఖీ పూర్తి అయ్యిందని తెలిపారు. దీంతో ఎల్లారెడ్డిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో 19వతేదీ సోమవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి గ్రామ ప్రత్యేకాధికారులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

## సన్మార్గంలో నడవాలి

రుద్రూర్, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాలులో మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు పలు అంశాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచే అల్లాహ్ చూపిన సన్మార్గంలో నడవాలని మతపెద్దలు సూచించారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని అన్నారు. కార్యక్రమానికి మండల కేంద్రంలోని మూడు మదర్సాల నుంచి సుమారు 200 మంది బాలబాలికలు హాజరుకాగా, చిన్నారులకు పోటీ పరీక్ష నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షరుద్దీన్, తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ముల్తానీ, సదర్ షేక్ మహ్మద్, డివిజన్ స్పోక్‌పర్సన్ ఇర్ఫాన్, అబ్దుల్ రహీం, మౌలానా, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**పాస్‌పోర్ట్ పోయినది**
నేను అనగా GIREDDY ABHILASH S/o. GIREDDY ASHOK R/o.H.No.6-16-246, అంబెడ్కర్ కాలనీ, సుభాష్‌నగర్, నిజామాబాద్. (New) H.No.3-105, గుండారం (V), మం॥ జి॥ నిజామాబాద్. నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. F1364804 గలది. తేది: 12.02.2024 మా ఇల్లు మారుతున్నప్పుడు పోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించగలరు. సెల్ నెం: 99484 84545.

**WANTED**
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-AII

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
GST వర్తించును

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



# మట్టిస్నానం.. ప్రకృతి వైద్యం

కామారెడ్డి, ఫిబ్రవరి 18: జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఆదివారం జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో మట్టి స్నానం చేశారు. ఇందులో భాగంగా 90 మంది మట్టి స్నానం చేశారు. మట్టి స్నానం.. ప్రకృతి చికిత్సలాంటిదని, అనేక వ్యాధులు దూరమవుతాయని వారు తెలిపారు. కార్యక్రమంలో యోగా గురువు రాంరెడ్డి, అంజయ్య, రఘుకుమార్, డాక్టర్ దేవయ్య, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీపతి యాదవ్, ఉరుదొండ నరేశ్, శివాజీరావు, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

# గాంధారి సంతలో.. జోరుగా పప్పు దినుసుల విక్రయాలు



గాంధారి, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని వారాంతపు సంతలో పప్పు దినుసుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి ఆదివారం నిర్వహించే గాంధారి సంతకు మండలంలోని చుట్టుపక్కల గ్రామాలతోపాటు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. బాన్సువాడ, పిట్లం, బిచ్కుంద తదితర మండలాల నుంచి వ్యాపారులు పప్పు దినుసులను తీసుకువచ్చి ఇక్కడి సంతలో విక్రయిస్తున్నారు. పెసర పప్పు కిలో 120 నుంచి 130 రూపాయలు, మినప పప్పు 120 నుంచి 130 రూపాయలు, కంది పప్పు 170 రూపాయల వరకు, జొన్నలు రూ.60, గోధుమలు రూ.50 కిలో చొప్పున విక్రయిస్తున్నారు. పప్పు దినుసులను కొనుగోలు చేసేవారితే సంత సందడిగా మారింది.